## నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



నీలగిరి, డిసెంబర్ 7: నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా కందుకూరి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ డాక్టర్ కేవీ రమణాచారి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును కమిషనర్‌గా నియమిస్తూ సీడీఎంఏ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. రెండేండ్ల క్రితం నల్లగొండ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టడం తో అప్పట్లో కేసీఆర్ ప్రత్యేకంగా రమణాచారికి పోస్టింగ్ ఇచ్చారు. దాంతో ఆయన నల్లగొండ పట్టణ ప్రగతిపై ఆయన తనదైన ముద్ర వేశారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- డీఈఓ భిక్షపతి



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

రామగిరి, డిసెంబర్ 7 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ బి.భిక్షపతి సూచించారు. నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు చేసి విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే సెయింట్ ఆల్ఫోన్స్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా వివిధ క్లాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్లతో విద్యాశాఖ సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు.

# ఉత్తమ్‌కు హోం .. వెంకట్‌రెడ్డికి మున్సిపల్

- ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు

సూర్యాపేట, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రి వర్గంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రెండు మంత్రి పదవులు వరించాయి. ప్రస్తుతం హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి 1994లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఇప్పటి వరకు ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి ఎంపీగా గెలువగా ఉమ్మడి రాష్ట్రంలో గృహనిర్మాణశాఖ మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం రెండోసారి గురువారం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా తొండ తిరుమలగిరి మండలం తాటిపాములలో నలమాద పురుషోత్తంరెడ్డి, ఉషాదేవి దంపతులకు జన్మించారు. నేషనల్ డిఫెన్స్ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. అనంతరం సీనియర్ కమర్షియల్ పైలెట్ హోల్డర్ లైసెన్స్ తీసుకొని ఐఏఎఫ్‌లో ఫైటర్ పైలెట్‌గా పనిచేశారు. ఫ్రంట్ లైన్ ఫైటర్ స్క్వాడ్రన్‌లో ఎం ఐజీ-21, ఎంఐజీ-23 విమానాలు నడిపారు. భారత వైమానిక దళం తరుపున పాకిస్తాన్‌లో విధులు నిర్వర్తించారు. తదనంతరం 1994లో కోదాడ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత 1999, 2004 రెండుసార్లు, కోదాడ 2009, 2014, 2018, 2023లలో నాలుగు సార్లు హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా మొత్తం ఆరుసార్లు గెలు పొందారు. 2019లో నల్లగొండ ఎంపీగా బరిలో నిలిచి గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో 610 జీఓ అమలు చైర్మన్‌గా, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఏండేడ్లుకుపైగా పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో హోంశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

### యువజన నేత నుంచి రెండో సారి అమాత్యులుగా ..

మంత్రి పదవిని దక్కించుకున్న నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయం జీవితం ఆరంభించి రాష్ట్ర మంత్రి పదవి బాధ్యతలను నిర్వర్తించారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలకు చెందిన కోమటిరెడ్డి పాపిరెడ్డి, సుశీలమ్మ దంపతుల కుమారుడు వెంకట్‌రెడ్డి. తొలిసారి 1999లో నల్లగొండ కాంగ్రెస్‌నుంచి ఎమ్మెల్యేగా గెలుపొం దారు. 2014 వరకు వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018లోఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తిరిగి ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడంతో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ గాయత్రి హోమం

- హాజరైన మద్దిమడుగు గురుస్వామి జయరాం



తులసీ నగర్ భక్తాంజనేయస్వామి ఆలయంలో హోమం చేస్తున్న గురుస్వాములు

రామగిరి, డిసెంబర్ 7 : నల్లగొండ తులసీనగర్ భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. అర్చక స్వాముల మంత్రోచ్ఛరణలతో జరిపారు. అలాగే ఉదయం హనుమాన్ మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద హనుమాన్ గాయత్రి హోమం నిర్వహించగా మద్దిమడుగు హనుమాన్ గురుస్వామి జయరాం హాజరై ప్రవచనలు చేశారు. అనంతరం అర్చక స్వాములు తీర్థప్రసాదాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు హాజరయ్యారు. వేడుకల్లో హనుమాన్ దీక్ష గురుస్వాములు, ఆలయ అర్చకులు శివప్రసాద్‌శర్మ, చంద్రశేఖర శాస్త్రి, హరీశ్ శర్మ, హనుమంతాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గోలి అమరేందర్‌రెడ్డి, సభ్యులు

నీలగిరి, డిసెంబర్ 7 : జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో వివిధ కూడళ్లలో చలితో ఇబ్బందిపడుతున్న నిరాశ్రయులకు జిల్లా చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి రగ్గులను (బ్లాంకెట్స్)గురువారం తెల్లవారు జామున అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి ఆధారం లేకుండా రోడ్డు పక్కన జీవిస్తున్న నిరాశ్రయులకు ఉదయం నాలుగు గంటల నుంచి జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులతో దుప్పట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు మందడి నర్సిరెడ్డి, సభ్యులు సూరెడ్డి సరస్వతి,రాంబాబు జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది సద్దాం హుస్సేన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ ఆధ్వర్యంలో..

నల్లగొండ రూరల్ :లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యురాలు రమాదేవి కుమారుడు కీర్తి చైతన్య పుట్టిన రోజు సందర్భంగా పలు ప్రాంతాల్లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 50 దుప్పట్లు, గొడుగులు పలువురికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సింగం లక్ష్మి , యాస సరళ, పుష్పలత, రమాదేవి, కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో.

## రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు తీవ్ర అన్యాయం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్

శాలిగౌరారం, డిసెంబర్ 7: రాష్ట్ర మంత్రి వర్గంలో 12 మంది క్యాబినెట్ మంత్రుల్లో బీసీలకు కేవలం 2 మంత్రి పదవులు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ గురు వారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే కేవలం 7శాతం ఉన్న అధిపత్యం కులాలకు 7 మంత్రి పదవులు, 60 శాతం జనాభా కలిగిన బీసీలకు 2 మంత్రి పదవులు కేటాయించడం దారుణమని పేర్కొన్నారు.

## బలహీనపడిన మిగ్‌జాం తుఫాన్

- తగ్గిన చలితీవ్రత
- నాలుగు మండలాల్లో కురిసిన చిరుజల్లులు
- జిల్లాలో 1.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నీలగిరి, డిసెంబర్ 7 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గురువారం బలహీన పడింది. ఫలితంగా చల్లని గాలులు తగ్గాయి. జిల్లాలో కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే చిరుజల్లులు కురిశాయి. ఉష్ణోగ్రతలు పెరుగడంతో వృద్ధులు, చిన్నారులు చలి తీవ్రత నుంచి ఉపశయనం పొందారు. గురువారం కేవలం నాలుగు మండలాల్లో కురువగా అత్యధికంగా కట్టంగూర్ మండలంలో 0.7, నార్కట్‌పల్లిలో 0.5 నిడుమనూర్‌లో 0.2, గుండ్లపల్లిలో 0.1 మిల్లీ మీటర్ల వర్షం కురువగా జిల్లా వ్యాప్తంగా సగటున 1.6 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఈసీజన్‌లో ఇప్పటివరకు 643.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సిండగా కేవలం 530.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో సాధారణ వర్షపాతానికి -17.6 శాతం తక్కువగా వర్షం కురిసింది.

## తమ్ముడపల్లి చెరువు భూమిని సర్వే చేయాలని వినతి



తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తమ్ముడపల్లి గ్రామస్తులు

మర్రిగూడ, డిసెంబర్ 7 : మండలంలోని తమ్ముడపల్లిలో సర్వే నంబర్ 82, 83,84లలో గల చెరువు భూమిని సర్వే చేయాలని కోరు తూ గ్రామస్తులు గురువారం తాసీల్దార్ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొట్టం మాధవీరమేశ్, ఎంపీటీసీ గండికోట రాజమణీహరికృష్ణ మాట్లాడుతూ చెరువు భూమి కబ్జాకు గురి కావడంతో చెరువు పక్క నుంచి వెళ్లడానికి రైతులకు దారి లేకుండా పోయిందన్నారు. భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అయిలీ యాదయ్య, గ్రామస్తులు గండికోట శ్రీరాములు, నర్సింహ, డేరంగుల వెంకటయ్య, అశోక్, పాల్గొన్నారు.

### కళాకారుడు పిచ్చయ్యకు జాతీయ నంది పురస్కారం

మఠంపల్లి, డిసెంబర్ 7 : భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కల్పనా కళానికేతన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన శివాని ఆర్ట్స్ నాటకోత్సవంలో జాతీయ నంది పురస్కారం అందుకున్నట్లు మఠంపల్లికి చెందిన ప్రముఖ సినీ, రంగస్థల కళాకారుడు గుంటి పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలతో పాటు పలు నాటికలు, ఏకపాత్రాభినయాలకు గుర్తుగా జాతీయ నంది పురస్కారంతో పాటు షీల్డ్, సువర్ణ కంకణధారణం, పుష్పక కిరీటంతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. పిచ్చయ్య జాతీయ నంది పురస్కారం అందుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### మహిళ దారుణ హత్య

తిప్పర్తి, డిసెంబర్ 7 : మండలంలోని దుప్పల పల్లి శివారులో గురువారం మహిళ దారుణ హత్యకు గురైంది. శాలిగౌరారం సీఐ రాఘు వరావు, తిప్పర్తి ఎస్ఐ ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. దుప్పలపల్లి రైల్వే ట్రాక్ వెంట రసూల్‌పురం గ్రామానికి వెళ్లే డొంక దారిలో మహిళ మృతదేహం ఉండడంతో స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో సంఘటన స్థలాన్ని క్లూస్ టీం, క్రైం బ్రాంచ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. విచారణలో నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన మంజుల (33)గా గుర్తించారు. మృతురాలు నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ప్రైవేటు దవాఖానలో పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే హత్య ఎవరు చేశారో, ఎందుకు చేశారో కారణాలు తెలియ రాలేదు. ఆమె మెడకు చున్నీతో రాయితో కొట్టి చంపినట్లు గుర్తులు ఉన్నాయి.మృతదేహాన్ని నల్లగొండలోని మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పాఠశాలల్లో లింగ వివక్షకు ఆస్కారం ఇవ్వొద్దు

- సీడీపీఓ లావణ్యకుమారి



మాట్లాడుతున్న సీడీపీఓ లావణ్య కుమారి

మర్రిగూడ, డిసెంబర్ 7 : పాఠశాలల్లో లింగ వివక్షను అధిగమించినప్పుడే బాలబాలికలు సమాన అవకాశాలు పొందుతారని సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి హైస్కూల్‌లో బేటి బచావో బేటీ పడావో, అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలికలు,మహిళలు చైతన్యవంతులైతేనే ఆరోగ్యవంతమైన సమాజం రూపు దిద్దుకుంటుందని ఆమె అన్నారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, సూపర్ వైజర్ పద్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.